క్లుప్తంగా...

లింగ్యానాయక్‌ను అభినందించిన కలెక్టర్



సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా పదోన్నతిపై బదిలీపై వెళ్లడం ఆనందంగా ఉందని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆయనను అభినందించారు. ప్రతి ఉద్యోగికి బదిలీలు సాధారణమని, ప్రజలకు చేసిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌గా లింగ్యానాయక్‌కు పదోన్నతి

కీసర ఆర్డీఓ రవి నల్గొండకు బదిలీ

సాక్షి, మేడ్చల్‌జిల్లా: ఎన్నికల బదిలీల్లో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డీఆర్‌ఓగా పని చేస్తున్న లింగ్యానాయక్ పదోన్నతిపై వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా(రెవెన్యూ విభాగం) బదిలీ అయ్యారు. మూడేళ్లుగా లింగ్యానాయక్ ఇక్కడ పని చేస్తున్నారు. అలాగే, కీసర ఆర్డీఓగా పనిచేస్తున్న రవి నల్గొండ ఆర్డీఓగా బదిలీ అయ్యారు. రవి కూడా మూడేళ్లుగా కీసర ఆర్డీఓగా ఇక్కడి ప్రజలకు సేవలందించారు. రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహించిన ఇద్దరు అధికారులకు సౌమ్యులుగా సంబంధిత శాఖల్లో మంచి పేరుంది.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని, కనీసం ఇళ్ల స్థలాలు లేని వారికి వంద గజాల భూమి కేటాయించి, నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కులవివక్ష పోరాట సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ లింగ్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కుటుంబంలో ఒక్కరికే కాకుండా వృద్ధులైన వారందరికీ ఆసరా పింఛన్ ఇవ్వాలన్నారు. జిల్లాలో ఇప్పటికీ నిర్మాణమై ఉన్న రాజీవ్ గృహకల్ప ఇళ్లు పేదలకు కేటాయించాలన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు కృపాసాగర్, బాలపీర్ పాల్గొన్నారు.


16న జవహర్‌నగర్‌లో బోనాలు



సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు


జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో ఈ నెల 16, 17వ తేదీన ఆషాఢమాస బోనాలు నిర్వహిస్తున్నట్లు మహంకాళి దేవాలయ చైర్మన్ కారింగుల రాజుగౌడ్, వైస్ చైర్మన్ కొయ్యడ వెంకటేష్ సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. 16న ఆదివారం బోనాలు, 17న సోమవారం జాతర, రంగం ఫలహారం బండ్ల ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు బోనాలకు అన్ని ఏర్పాట్లు చేస్తామని, భక్తులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.ఆలయ కమిటీ సలహాదారులు, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల అధ్యక్షులు, స్థానిక వాసులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



మేడ్చల్: బీజేపీ చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని రావల్‌కోల్ గ్రామంలో పోలింగ్ బూత్‌ల పరిధిలో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. తమిళనాడు బీజేపీ నాయకుడు మండల ఇన్‌చార్జి ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు పోచయ్య, శ్రీశైలం యాదవ్, ఆకుల రవీందర్, స్వామి పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



కీసర: కీసర శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయం తరఫున నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. శ్రీమాధవానంద సరస్వతి స్వామిజీ చేతులమీదుగా అందజేశారు. చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి

గురుపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్ని సుందరంగా అలంకరించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు.
గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయాల్లో పెద్దఎత్తున పూజలు నిర్వహించారు.



మేడ్చల్ సాయిబాబా ఆలయంలో మంత్రి మల్లారెడ్డి



సాయినాథుడి సేవలో భక్తులు



చౌదరిగూడలో అన్నదానం చేస్తున్న రాములుగౌడ్



ఎదులాబాద్‌లో పూజల్లో ఆలయ ధర్మకర్త సురేందర్



నాగారంలో గురుపూజోత్సవం



రియల్ ఎస్టేట్‌లకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం

ప్రజా సంఘాల పోరాట వేదిక ధర్నాలో రాష్ట్ర నేత డీజీ నర్సింహరావు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పేద ప్రజలకు వంద గజాల జాగా ఇవ్వలేని ప్రభుత్వం బడా కార్పొరేట్ పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ భూములను వారికి అప్పగిస్తోందని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకుడు డీజీ నరసింహారావు తీవ్రంగా ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పక్షమా.. లేదా పెట్టుబడిదారుల పక్షమా తేల్చుకోవాలని అవసరముందన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో కార్యకర్తలు, ప్రజలు ధర్నా చేశారు. కార్మికులు కర్షకులు, పేదలు, వ్యవసాయ కార్మికులు, మహిళలు ఏకమై ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో పలు జిల్లాల్లోని ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేస్తే ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి తీసేయిస్తోందన్నారు. ప్రజాసంఘాల కార్యకర్తలపై ప్రభుత్వం పోలీసులతో లాఠీచార్జి చేయించడంతో పాటు అక్రమ కేసులు బనాయిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉన్న కొద్దిమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములను కబ్జా చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల జీవోలను సవరించకపోవడంతో కార్మికులు రూ.లక్షల కోట్లు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవోలను సవరించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓ లింగ్యానాయక్‌కు ప్రజాసంఘాల వేదిక ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు పాలడగుల భాస్కర్, కె.రవి, అశోక్, చంద్రశేఖర్, ఐద్వా నాయకురాళ్లు వినోద, మంగ, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, రమేష్, ప్రజాసంఘాల నేతలు బాలపీర్, కృపాసాగర్, శ్రీనివాస్, గణేష్, వెంకన్న, సబిత, రాజశేఖర్, లింగస్వామి, శ్రీనివాస్, నర్సింగరావు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం

మేడ్చల్: పట్టణంలోని 16వ వార్డు ఎన్‌జీఓస్ కాలనీలో నిర్మిస్తున్న అండర్ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి ప్రారంభించారు. కౌన్సిలర్ ఉమా నాగరాజుతో కలిసి నిర్మాణ పనులకు ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. రూ.10 లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. అన్ని వార్డుల్లో మెజారిటీ సమస్యలను తీర్చి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని అన్నారు. అన్ని వార్డుల్లో సమస్యలను పరిష్కరించి మేడ్చల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా మారుస్తామని అన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యురాలు గీత, నాయకులు కమ్రుద్దీన్, బాబిరెడ్డి, బాలరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో కలిసి పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



జవహర్‌నగర్ మార్వాడి లైన్‌లో అవగాహన కల్పిస్తున్న క్రాంతి కళాకారుల బృందం

జవహర్‌నగర్: క్రాంతి కళా బృందం వ్యవస్థాపకులు వెంకటాచారి బృందం ఆధ్వర్యంలో సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ మార్వాడి లైన్‌లో పలు సామాజిక అంశాలపై అంశాలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, చెడు అలవాట్లు, బాల్య వివాహాలు, లోన్ యాప్‌లతో యువకుల ఆత్మహత్యలు, బడీడు పిల్లలు పాఠశాలలకు వెళ్లాలని ఆట, పాటలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణగౌడ్ మాట్లాడుతూ.. నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని అనారోగ్యాలకు గురికాకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి జంగిడి శ్రీనివాస్, కాప్రా మండల కార్యదర్శి రుద్రవెల్లి బబ్లు, విష్ణు, బాలు, క్రణ్, జహంగీర్, కళాకారులు ఆంజనేయులు, మల్లేష్, యాదయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రైల్వేవంతెన పనులు పూర్తిచేయాలని వినతి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులను త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ ఎస్‌సీ శ్రీనివాస్‌కు పలువురు నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం సచివాలయంలో మంత్రి మల్లారెడ్డిని కలిశారు. తక్షణమే రోడ్డు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ సతీశ్‌కుమార్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. వారం రోజుల్లో వంతెన కాంట్రాక్ట్ టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ నర్సింగ్‌రావు, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, మాజీ ఎంపీటీసీ నర్సింగ్‌రావు, సిరాజ్, అన్నూబాయ్, మాధవరెడ్డి, నరేశ్‌గౌడ్, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, సిరాజ్ పాల్గొన్నారు.



అధికారికి వినతి పత్రం అందజేస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

మీ సేవలు భేష్..



మేడ్చల్: గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారడంతో ఆ రోడ్డులోని గుంతలకు మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు మరమ్మతులు చేయించారు. డబీల్‌పూర్ రోడ్డులో జాతీయ రహదారిపై ఉన్న కమాన్ వద్ద ఏర్పడిన గుంతలతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారడంతో ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి తన బృందంతో కలిసి మరమ్మతులు చేయించారు. బీటీ తెప్పించి గుంతల్లో వేయించి మరమ్మతులు చేశారు. మండలంలో ఏ రోడ్డులో గుంతలు ఏర్పడ్డా, కంకర తేలినా ఇతర ఏ మరమ్మతులకు వచ్చినా ట్రాఫిక్ సీఐ వెంటనే స్పందించి మరమ్మతులు చేయిస్తుండటంతో ఆయనపై మండల ప్రజలు ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికుడిని ప్రభుత్వమే ఆదుకోవాలి



ఘట్‌కేసర్: అనారోగ్యం పాలైన ఎదులాబాద్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు సత్తయ్యను ఆయన నివాసంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి సోమవారం కలిసి పరామర్శించారు. అనంతరం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల పరిస్థితి దీనంగా మారిందని, కార్మికులకు ప్రభుత్వం సమయానికి వేతనాలు చెల్లించడం లేదన్నారు. ఐదు నెలలు కావొస్తున్నా సత్తయ్యకు పంచాయతీ నుంచి పైసా ఇచ్చి ఆదుకోలేదని, ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

డబుల్ ఇళ్లను వాటా ప్రకారం కేటాయించాలి

కీసర: రాంపల్లిలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో కరీంగూడవాసులకు రావాల్సిన వాటా ప్రకారం కేటాయించాలని కీసర తహసీల్దార్‌ను సర్పంచ్ కొకుట్ల గోపాల్‌రెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. కరీంగూడ గ్రామంలోని 75 పేద కుటుంబాలు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటిలో 40 దరఖాస్తులే తమకు అందాయని తెలిపారు. వీరంతా అద్దె ఇళ్లలో నివసిస్తున్నారని, గ్రామానికి రావాల్సిన వాటా ప్రకారం ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయడంతో పరిశీలిస్తామని తహసీల్దారు అన్నారు.

ప్రాధాన్యత రంగాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంతంగా చేపట్టి, మేడ్చల్ జిల్లాను మరింత అగ్రగామిగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. హరితహారం, రెండవ విడత గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి కార్యక్రమం, ఇంటి స్థలాల పంపిణీ, బీసీ కుల వృత్తులకు ఆర్థికసాయం, వైకుంఠధామాలకు విద్యుత్ సదుపాయంపై జిల్లా కలెక్టర్ అమయ్ మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గణాంకదర్శినిని ఆవిష్కరించిన కలెక్టర్



సాక్షి, మేడ్చల్‌జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గణాంక దర్శిని 2021–22 పుస్తకాన్ని సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక ప్రణాళిక విధాన, రూపకల్పనలో గణాంకాలు చాలా ముఖ్యమైనవన్నారు. రోజువారి జీవితంలో గణాంకాలు దోహదపడతాయని తెలిపారు. జిల్లా గణాంక దర్శినిలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, విద్య, రవాణా, నీటి వనరులు, పంటలు, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, లోకల్ బాడీ, ఇండస్ట్రీస్ సోషల్ సెక్యూరిటీకి సంబంధించిన అంశాలు వివరంగా ఉంటాయని తెలిపారు. గణాంక దర్శినిలో అన్ని శాఖల జిల్లా గణాంక వివరాలు పొందుపరచడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, ముఖ్య ప్రణాళిక అధికారి మోహన్‌రావు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



సాక్షి, సిటీబ్యూరో: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ జిల్లా వైస్ చైర్మన్ గిరిశెట్టి రాజు కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద శాంతియుత నిరాహార దీక్ష నిర్వహించారు. అనంతరం డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు దొంగల మైసమ్మ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద శాంతియుత నిరాహార దీక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా.. వడ్డెర్ల స్థితిగతులు మారడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డెర కులాన్ని గుర్తించి, న్యాయబద్ధంగా రావాల్సిన హక్కులను కల్పించాలని కోరారు. ఉప్పల్ భగాయత్‌లో నిర్మించ తలపెట్టిన వడ్డెర్ల ఆత్మగౌరవ భవనాన్ని రూ.5 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించి వడ్డెర జాతికి అంకితం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వరికుప్పల మల్లేష్, రాష్ట్ర నాయకులు ఎత్తరి గణేష్, శివరాత్రి ఉమా, ఇరుగదిండ్ల తిరుపతి, శివరాత్రి సుధాకర్, కొమిర వెంకటేష్, పల్లపు నవీన్, ఎత్తారి శీను, గుంజ శ్రీనివాస్, ఇరగదిండ్ల రవి, జిల్లా యూత్ నాయకులు, కుల బంధువులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి

మేడ్చల్: పట్టణానికి చెందిన వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు బీజేపీలో చేరారు. పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి సమక్షం యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జీ.మహేష్, మహేష్‌బాబు వారి మిత్రులు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ప్రేందాస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కిషన్‌రావు తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీ వారం సంత వేలం

ఘట్‌కేసర్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్ పర్సన్ పావనీజంగయ్య యాదవ్, కమిషనర్ వేమనరెడ్డి ఆధ్వర్యంలో వారం సంత వేలం పాట సోమవారం నిర్వహించారు. రాజేశ్, శివకృష్ణ ఇరువురు వేలంలో పోటీపడ్డారు. అత్యధికంగా శివకృష్ణ రూ.3,01,000లకు వేలం పాడి వారం సంత కైవసం చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం వేలం కైవసం చేసుకున్న వ్యక్తి మార్చి 31, 2024 వరకు ఒక్కో వ్యక్తి దగ్గర రూ.25 వసూలు చేయాలి.



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ వారం సంత వేలం వేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ వేమనరెడ్డి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకోవాలి



పూడూర్‌లో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి



ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పర్చుకుంటే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, దాంతో పాటు అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉంటుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని పూడూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేల తో ఆధునికరించిన భవనాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదివి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం పాఠశాల విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తూ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు. గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి రూ.4 లక్షలను పాఠశాల అభివృద్ధికి ఇవ్వడంతో ఆయనను అభినందించారు. గ్రామ సర్పంచ్ బాబు యాదవ్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు షూస్ అందజేశారు. ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజవిజయానంద్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ వెంకటేషం, సర్పంచ్ బాబు యాదవ్, ఉపసర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ రఘు, సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ కృషి

కీసర: మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపల్ పరిధిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలోని వివిధ మున్సిపాలిటీలు, గ్రామాల్లో సుమారు 2 వేల మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇప్పించడంతో పాటు శిక్షణ పూర్తయిన వారికి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు షూస్ అందజేస్తున్న సర్పంచ్ బాబుయాదవ్